క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

• సీఐ మంగరాజు


బి.మంగరాజు

సోంపేట/కంచిలి: నూతన సంవత్సర వేడుకలను నిబంధనలు అతిక్రమించి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని సోంపేట సీఐ బి.మంగరాజు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత గుంపులుగా తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కట్ చేయడం, బాణసంచా కాల్చడం, బహిరంగ పార్టీలు చేయవద్దన్నారు. .డీజే, లౌడ్‌స్పీకర్ ఉపయోగించి ఇతరులకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకే తెరచి ఉంచాలన్నారు.

రూ. 42 వేల ఆర్థిక సాయం


దేవాకికి సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం గ్రామానికి చెందిన భుక్త దేవాకి అనే మహిళ ఇటీవల నిచ్చెన ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోడవంతో వెన్నుపూస నరాలకు గాయమై కాళ్లు చచ్చుబడిపోయాయి. శస్త్రచికిత్సకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కేధారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. ఆదివారం క్షతగాత్రురాలిని పరామర్శించి రూ.42 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

దుప్పట్లు పంపిణీ


వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న లయన్స్ సభ్యులు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం లయన్స్ క్లబ్ కోస్టల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం అనాథలు, యాచికులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మందస రైల్వేస్టేషన్, హరిపురం బస్టాండ్ పరిసరాలలో చలికి ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బైరిశెట్టి గున్నయ్య, సెక్రటరీ వై.ఎస్.ఎన్.మూర్తి, ట్రెజరర్ లక్ష్మణరావు, మార్పు వెంకటేశం, జన్ని రాము, పుల్లవాసు పాల్గొన్నారు.

స్థలం విషయమై వివాదం


ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

కాశీబుగ్గ: స్థలం విషయమై ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురం ప్రాంతంలోని ఎర్ర చెరువు గర్భంలో కొంతభాగాన్ని కొంత మంది అనేక సంవత్సరాలుగా వాడుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేలో భాగంగా ఇరువర్గాలవారు స్థలం తమదంటే తమదని గొడవ పడుతున్నారు. ఆదివారం స్థానిక దళిత కుటుంబాలకు చెందిన వారు ఆ స్థలం తమదంటూ యాదవులకు చెందిన మేకలశాలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో వివాదత తలెత్తింది. విషయం పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ దృష్టికి వెళ్లింది. స్పందించిన అధికారులు ఆర్ఐ ఖగేశ్వరరావు, సర్వేయర్ గిరి ప్రసాద్, వీఆర్వోలు నౌషిత్, జుబీర్‌లు, కాశీబుగ్గ పోలీసులను వివాద స్థలం వద్దకు పంపించారు. దీంతో వారు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. స్థలం విషయంపై రీసర్వే చేసి మార్కింగ్ ఇస్తామని.. అంతవరకు సంయమనం పాటించాలని ఇరువర్గాలకు సూచించారు.

న్యాయవాదికి సత్కారం


అనీల్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస బార్ అసోసియేషన్ కార్యదర్శి, న్యాయవాది గెడ్డం అనీల్‌రాజు చేస్తున్న సేవలకు గుర్తింపు దక్కింది. విశాఖపట్నంలోని ఎన్‌బీఎం లా కళాశాలలో ఆదివారం జరిగిన న్యాయవాదుల ప్రత్యేక కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జడ్జి కళ్యాణ చక్రవర్తి, సీనియర్ సివిల్ జడ్జి లతల చేతులమీదుగా సత్కారం పొందారు. పలాస పరిసర ప్రాంతాలలో బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి చేస్తున్న అవగాహన, సేవా కార్యక్రమాలను గుర్తించి అనీల్‌కుమార్‌ను సత్కరించారు.

టెక్కలిలో ప్రపంచ దివ్యాంగు దినోత్సవం రేపు

టెక్కలి: ఈ నెల 31న ప్రపంచ దివ్యాంగు దినోత్సవం సందర్భంగా మంగళవారం టెక్కలిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి దివ్యాంగులంతా హాజరు కావాలని కోరారు.

ఊగుతున్న వంతెనలు!


పలాస-బెండిగేటు మధ్య శిథిలమైన బెండిగెడ్డ వంతెన


రెయిలింగ్, రక్షణ గోడ లేని కంబిరిగాం వంతెన

- ప్రధాన రహదారులపై శిథిలమైన వైనం
- పట్టించుకోని నేతలు, అధికారులు
- కూలిపోయిన రెయిలింగ్‌లు
- పెచ్చులూడుతున్న శ్లాబులు

వజ్రపుకొత్తూరు: వంతెనలు ఊగుతున్నాయి. జనం భయం పడుతున్నారు. పలాస నియోజకవర్గంలో ప్రధాన రహదారులపై ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలం కావడమే ఈ పరిస్థితికి కారణం. ఏ క్షణంలో కూలిపోతాయోనని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన వాటిని తొలగించి కొత్తవి నిర్మించాల్సి ఉన్నా వివిధ కారణాలతో నేతలు, అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు శిథిల వంతెనలపై ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి. ప్రధానంగా వరదలు, అధిక వర్షాలు కురిసే సమయంలో ఈ వంతెనలపై రాకపోకలు మరీ ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల వంతెనలకు ఇరువైపులా రెయిలింగ్‌లు సైతం దెబ్బతినడంతో పరిస్థితి ఆందోళనగా మారింది.

తరచూ ప్రమాదాలు..

పాత జాతీయ రహదారిపై బెండిగేటు నుంచి పలాస వెళ్లే దారిలో బ్రిటీష్ కాలం నాటి వంతెన రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి అటు మెళియాపుట్టి, టెక్కలి, పలాస, పూండి, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, మంచినీళ్ల పేటకు రాకపోకలు చేసేవారితో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనిని అత్యవసరంగా నిర్మించాల్సి ఉన్నా చర్యలు తీసుకున్ననాథుడే కరువయ్యారు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యమైయ్యాయి. ఇక మెట్టూరు నుంచి ఒంకులూరు వెళ్లే మధ్యలో రాకాసి గెడ్డపై వంతెన శిథిలమైంది. దీనిని నిర్మించాలని దశాబ్ద కాలంగా స్థానికులు అభ్యర్థించినా చర్యలు తీసుకోక


మెట్టూరు-ఒంకులూరు మధ్య ఊగిసలాడుతున్న రాకాసి గెడ్డ వంతెన

పోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 7.50 కోట్లు మంజూరు చేసింది. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఉన్న రక్షణ గోడలు సైతం శిథిలమైయ్యాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా మళ్లీ దెబ్బతింటున్నాయి. దీంతో ప్రయాణం నరక ప్రాయమవుతోంది. ఈ రహదారిపై నిత్యం వాహన చోదకులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. మందస మండలం సొండిపూడి, బాలాజీపురం, మందస-గొప్పిలి జాతీయ రహదారి నుంచి మందస టౌన్ వెళ్లే రహదరిపై వంతెనలు కూడా శిథిలమై భయం గొలుపుతున్నాయి. పలాస మండలంలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన బ్రాహ్మణతర్లా, మరో రూ.25 లక్షలతో నిర్మించిన కంబిరిగాం వంతెనలపై రక్షణ గోడ, రెయిలింగ్ లేకపోవడంతో వరదల సమయంలో నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. ఆ సమయంలో వంతెన ఎక్కడుందో తెలియని పరిస్థితి ఉంది.

ప్రమాదాలు నివారించాలి



బెండిగేటు వంతెనపై నుంచి పోవాలంటే భయమేస్తుంది. బ్రిటీష్ కాలం నాటి వంతెనపై ఉన్న రక్షణ గోడ శిథిలమైంది. వంతెన సైతం ఊగిసలాడుతోంది. పశువులు పడిపోతున్నాయి. వాణిజ్య కేంద్రమైన బ్రాహ్మణతర్లా వెళ్లాలంటే వర్షా కాలంలో అవస్థలు తప్పడం లేదు. వంతెనలను వదిలేస్తున్నారు. అది కాంట్రాక్టర్ల తప్పిదమో.. అధికారుల నిర్లక్ష్యమో తెలియడం లేదు. తక్షణమే వానిటి నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
– ఎ. గోవిందరావు, పొల్లాడ

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి



అక్కుపల్లి జంక్షన్ నుంచి ఒంకులూరుకు పక్కా బీటీ రహదారి ఉంది. మందస మండలానికి కనెక్టివిటీ ఉన్న ఈ రహదారిలో రాకాసి గెడ్డపై వంతెన నిర్మించకపోవడం బాధాకరం. గత ప్రభుత్వం దాదాపు రూ.7.50 కోట్లు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభం కాలేదు. గత 40 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్‌లు, అధికారుల నిర్లక్ష్యంతో నిర్మించలేదు. ఇప్పటికైనా కూటమి సర్కార్ వీటిపై దృష్టిసారించాలి.
– మోహన్, ఒంకులూరు

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సోంపేట: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రైతు సేవాకేంద్రాల సిబ్బంది, ధాన్యం కొనుగోలు నిర్వహణ సంస్థలు, మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలు కురవడంతో రైతులు ధాన్యం విక్రయించలేక పోయారన్నారు. ప్రస్తుతం నూర్పులు, మిషన్ కోతలు జరుగుతున్నందున రైతులకు సిబ్బంది సహకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించాలన్నారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ పూడి కూర్మరావు ఉన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

• ప్రజాకవి జయరాజు


మాట్లాడుతున్న ప్రజాకవి జయరాజు

సోంపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న జైభీమ్ సేనకు ధన్యవాదాలని సామాజిక వేత్త, ప్రజాకవి, గాయకుడు గొడిశాల జయరాజు అన్నారు. సోంపేట పట్టణంలో జైభీమ్ సంఘం ద్వితీయ వార్షికోత్సవాన్ని సంఘ వ్యవస్థాప అధ్యక్షులు నగిరి మోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సోంపేట గాంధీ మండపం వద్ద నుంచి జైభీమ్ సేన సంఘ భవనం వరకు అంబేడ్కర్ వాదులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జయరాజు మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా ఉద్యమాల గడ్డ అన్నారు. ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసినప్పటికీ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారి అనేకమంది జీవితాలను అతలాకుతలం చేస్తోందన్నారు. వ్యాధిని అరికట్టడానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. సమృద్ధిగా వనరులున్నా మనం అభివృద్ధి చెందలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో కులం, మతం పేరుతో ఒకరిని ఒకరు దూషించుకోవడం వలన అన్నివర్గాల వారికి ఇబ్బందులు తప్పా ప్రయోజనం లేదన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతీ కుటుంబం, ప్రతీ పౌరుడు అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. విద్యపై అన్ని వర్గాలు దృష్టిపెట్టాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళానికి చెందిన కల్లేపల్లి రాంగోపాల్, ఇచ్ఛాపురానికి చెందిన చల్ల దేవరాజులకు అంబేడ్కర్ సేవా పురస్కారం కింద జైభీమ్ సేన ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జీఎస్‌టీ మర్రిపాటి హరిష్‌కుమార్, విశాఖపట్నం జైభీమ్ సేన అధ్యక్షులు రవి సిద్దార్థ్, సమత సైనిక్ దళ్ నేషనల్ జనరల్ సెక్రటరీ దిగంబర్ కాళీదాస్, సంఘ జిల్లా అధ్యక్షులు బుష్క ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డొప్ప వెంకటరావు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


సోంపేట: శ్రీశయన సంఘు క్యాలండర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

సోంపేట: శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025వ సంవత్సరం నూతన క్యాలండర్‌ను సోంపేట పట్టణానికి చెందిన వైద్యులు ఆనింగి వెంకట రామకృష్ణ, తుంగాన వెంకటేష్ ఆదివారం ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షులు దీనబంధు, కార్యదర్శి కె.రాము, సంఘ ప్రతినిధులు దానయ్య, తాతయ్య, రెల్ల నారాయణ పాల్గొన్నారు.


కాశీబుగ్గ: ఆపస్ క్యాలెండర్ ఆవిష్కరణలో డాక్టర్ బాలక్రిష్ణ తదితరులు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం ఆవిష్కరించారు. జంట పట్టణాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలక్రిష్ణ చేతులమీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నెమలిపురి విష్ణుమూర్తి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కె.కోదండరామిరెడ్డి, ఉపాధ్యాయులు చక్రపాణి ప్రధాన్, టి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు ఇష్టపడి చదవడం ద్వారా అద్భుతాలు సాధిస్తారని ప్రొఫెసర్ మద్దు కామరాజు అన్నారు. అక్కుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక అధ్యక్షుడు బి.శివ అధ్యక్షతన అక్కుపల్లి శ్రీరామా యువజన సంఘం సౌజన్యంతో ఆదివారం జరిగిన ప్రతిభా పరీక్ష-విద్యా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలపై ఆసక్తి కనబరచాలని సూచించారు. ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆర్.గణపతి, లండ జగన్నాథం, కోడ లక్ష్మీనారాయణ, స్థానిక సర్పంచ్ లండ లోలాక్షి, లండ రామలింగం, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాల్, మోస వరప్రసాద్ పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ

సంతబొమ్మాళి: కొల్లిపాడు సర్పంచ్ గొలుసు సవరయ్య తల్లి చంద్రమ్మ మృతి చెందారు. దీంతో సర్పంచ్‌ను కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం పరామర్శించడంతోపాటు చంద్రమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అలాగే కాకరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎం.సింహాచలం కుమారుడు కిడ్నీ వ్యాధిలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించి సంతాపం తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క భీమారావు, మూర్పు నాగభూషణరావు, పి.శ్రీనివాసరెడ్డి, డి.భూషణరెడ్డి, కొండయ్య, సీతారాం ఉన్నారు.

నేడు కవిటి మండల సమావేశం

కవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన మండలపరిషత్ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సర ఆదాయ, వ్యయాలకు సంబంధించిన సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌లను ఆమోదానికి సంబంధించి చర్చించనున్నట్టు చెప్పారు.

బోటు ధ్వంసం


ధ్వంసమైన బోటును ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు

ఇచ్ఛాపురం రూరల్: సముద్రంలో లంగరు వేసిన బోటు రాకాసి అలలకు ధ్వంసం అయింది. డొంకూరు గ్రామానికి చెందిన బడే చిన్నారావు శనివారం తోటి మత్స్యకారులతో కలసి తన బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆదివారం వేకవ జామున సముద్రం తీరంలో లంగరు వేశారు. మధ్యాహ్నం వెళ్లి చూసేసరికి భారీ అలలకు బోటు ధ్వంసం కావడంతో బాధితుడు లబోదిబోమన్నాడు. సుమారు రూ.15 లక్షల విలువైన బోటుకు రూ.5 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు తెలిపారు. మత్స్యకాశాధికారులు స్పందిది తనకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

17 ఎక్సైజ్ కేసులు నమోదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ ఒకటి నుంచి 28వ తేదీ వరకు జరిపిన దాడులలో 17 కేసులు నమోదు చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. ఒడిశా మద్యం సీసాలు 71, డ్యూటీ పెయిడ్ లిక్కర్ 82 సీసాలు, 37 లీటర్ల ఒడిశా సారా, 18.5 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలను ఇచ్ఛాపురం, మందస మండలాల తహసీల్దార్ల ఎదుట హాజరు పరిచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. అక్రమంగా సారా అమ్మిన, రవాణా చేసినా, బెల్ట్ షాపులు నిర్వహించిన అలాంటివారిపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. సారా విక్రయాలు జరుగుతున్నట్టు తెలిస్తే 86399 59250, 94408 30385 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

డోకులపాడులో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు: పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డోకులపాడు సర్పంచ్ వడ్డి సరిత అన్నారు. ఆదివారం గ్రామంలో రోడ్లుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించారు. అమ్మవారి దేవాలయం, వాటర్ ట్యాంక్, ఉప్పాడ వారి వీధి తదితర చోట్ల పేరుకు పోయిన చెత్తను తొలగించి మరో వాహనంలో సుదూర ప్రాంతాలకు డంప్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వడ్డి కరుణాకర్, ఎంపీటీసీ సభ్యుడు కె.డిల్లేశ్వరారవు, పంచాయతీ కార్యదర్శి యాదవరాజు, వై.పాపారావు, బి.డిల్లేశ్వరారవు, కె.అప్పారావు ఉన్నారు.

ఈ కొమ్మ ప్రమాదాలను ఆపేనా?



టెక్కలి తెంబూరు రోడ్డులో వంశధార గెస్ట్ హౌస్ ఎదురుగా రోడ్డుకు ఒక వైపు భారీగా గొయ్యి ఏర్పడింది. అయితే గొయ్యిను పూడ్చి ఎటువంటి ప్రమాదాలు లేకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు స్పందించలేదు. స్థానికులు కొంతమంది ఆ గొయ్యిలో చెట్టు కొమ్మను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తత చర్యలు చేపట్టారు. అయితే అధికారులు స్పందించక పోయినా స్థానికులు సామాజిక దృక్పథంతో ఇటువంటి చర్యలు చేపట్టడం మంచిదే. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొయ్యిను పూడ్చే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – టెక్కలి

ఎస్‌జీఎఫ్ సాయం..



మండల కేంద్రం కంచిలిలో నివాసం ఉంటున్న వలస కూలీ నర్తు జగ్గారావు కొంతకాలంగా జీబీ సిండ్రోమ్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. దీని చికిత్స కోసం రూ. ఆరు లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. సాయం కోసం స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థ ఎస్‌జీఎఫ్‌ను సంప్రదించారు. స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు తక్షణ సాయంగా పది వేల రూపాయలను జగ్గారావుకు ఆదివారం అందజేసి అండగా నిలిచారు. స్థానిక వ్యాపారి పూనా శ్రీకాంత్, ఎస్‌జీఎఫ్ సభ్యులు మున్నా తదితరులు పాల్గొన్నారు. – కంచిలి

జనసంద్రం..



వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్ ఆదివారం జన సంద్రమైంది. పర్యాటకులతో కిక్కిరిసి పోయింది. అల్పపీడనం బలహీన పడడం, వాతావరణం సాధారణ స్థాయికి రావడంతో తీరానికి అధికసంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. అక్కడే వంటా వార్పు చేసుకుని భోజనాలు చేశారు. కుటుంబ సభ్యులతో తీరంలో సందడి చేశారు. – వజ్రపుకొత్తూరు

నూతన కార్యవర్గం..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వవార్డు శ్రీమంకినమ్మ ఆలయం ఆవరణలో లండ రవణ అధ్యక్షతన కాష్యూ లేబర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. జీడి కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నెయ్యల గణపతి, అధ్యక్షులుగా శిష్టు గోపి, ఉపాధ్యక్షులుగా లండ రవణ, ప్రధాన కార్యదర్శిగా అంబటి ఆనందరావు, సహాయ కార్యదర్శిగా గజ్జి బాలయ్య, కోశాధికారిగా సమ్యాన శాంతమూర్తి, లీగల్ అడ్వయిజర్‌గా కొమర దేవరాజు, ముఖ్య సలహాదారుగా బమ్మిడి సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. – కాశీబుగ్గ

మైక్‌సెట్ సంఘ ప్రతినిధుల రక్తదానం


రక్తదానం చేస్తున్న మైక్‌సెట్ ఓనర్స్

కాశీబుగ్గ: ఐదు మండలాలకు చెందిన వినాయక సౌండింగ్ అండ్ లైటింగ్ ఓనర్స్ యూనియన్ 14వ వార్షికోత్సవాన్ని మందస పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో సౌండింగ్ లైటింగ్‌కి సంబంధించిన ఎగ్జిబిషన్, పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర యూనియన్ ప్రెసిడెంట్ దువ్వు కాశీప్రసాద్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు సంగారు గోవిందరావు, అధ్యక్షులు జక్కం రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, సెక్రటరీ అభిమన్యుసాహు, సంయుక్త కార్యదర్శి రట్టి వైకుంఠరావు, ట్రెజరర్ గేదెల అప్పన్న, ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి, పలాస, వజ్రపుకొత్తూరు, టెక్కలి, నరసన్నపేట మండలాల అధ్యక్షులు దానయ్య, జక్కం రమేష్, బాలకృష్ణ, రామారావు, ధనరాజు, రాజారావు, సుదర్శన్, అప్పలనాయుడు, శ్రీకాకుళం టౌన్ అధ్యక్షులు గోపి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి


బ్యాగులను పరిశీలిస్తున్న కూర్మారావు

కాశీబుగ్గ: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను దుర్వినియోగ పరచకుండా సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస మండలం మూలిపాడు గ్రామంలో మహిళలు తయారు చేస్తున్న వైరు బ్యాగులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ పిల్లలకు, వివిధ రకాల పనులకు వెళ్లే కూలీలకు, ఆఫీసులకు వెళ్తున్న ఉద్యోగులకు, పెద్దలకు అవసరమైన క్యారేజీ బ్యాగులను తయారు చేస్తున్న మహిళలను అభినందించారు. లోకల్ మార్కెటింగ్ చేస్తూ తద్వారా వచ్చిన ఆదాయంతో శత శాతం బ్యాంకు రుణాలను తీరుస్తున్నట్లు గుర్తించారు. తయారు చేస్తున్న వస్తువులకు కావలసిన రుణ సదుపాయంతో పాటు ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొరికాన బాలకృష్ణ, వీవోఏ తులసీబాయి పాల్గొన్నారు.